క్లుప్తంగా

కృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించడంపై హర్షం

తెనాలిఅర్బన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడంపై మాస్ వ్యవస్థాపకుడు సుద్దపల్లి నాగరాజు, అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆళ్ళమూడి ప్రభాకరరావులు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో హర్షం ప్రకటించారు. కృష్ణ మాదిగ జాతిని చైతన్యం పరచడంతో పాటు, అనేక సామాజిక ఉద్యమాలు చేసి విజయం సాధించారని గుర్తు చేశారు. ఆయనకు పద్మశ్రీ ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు వితరణ

తెనాలి: పట్టణానికి చెందిన సాయిమంగ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని స్థానిక చినరావూరులోని వాసిరెడ్డి లక్ష్మీపతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు కంకిపాటి రమేష్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల విద్యార్థులకు స్టీల్ టిఫిన్ బాక్సులు, స్వీట్లను పంపిణీ చేశారు. 15 వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

'కోటప్పకొండ'పై సినిమా

తెనాలిలో సన్నివేశాలు చిత్రీకరణ



తెనాలిరూరల్: మహాశివరాత్రి పర్వదినం రోజున ప్రపంచవ్యాప్తంగా జాగరం చేసే కోట్లాది భక్తులకోసం ప్రఖ్యాత శైవ క్షేత్రమైన 'కోటప్పకొండ' స్థలపురాణం ఆధారంగా తెనాలికి చెందిన యువ దర్శకులు నరేష్ దోనె, మణివరన్‌లు సినిమా రూపొందిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఆదివారం పట్టణంలో చిత్రీకరించారు. సినీనటుడు బస్టాప్ కోటేశ్వరరావు, సునీత, మౌనికరెడ్డి నటించిన సన్నివేశాలను తెనాలిలో షూట్ చేశారు. సినిమాను ఇంగ్లిష్, హిందీ భాషల్లోకి అనువదించనున్నట్టు దర్శకులు తెలిపారు.


కాటూరి ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన సాయిమాధవ్

తెనాలిఅర్బన్: ప్రముఖ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కంచర్లపాలెంలో ఏర్పాటు చేసిన కాటూరి ఆర్ట్ గ్యాలరీని సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ ఆదివారం సందర్శించారు. గ్యాలరీలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, దేశ ప్రముఖులు, సినీ ప్రముఖులు, కళాకారుల విగ్రహాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐరన్ స్క్రాప్‌తో వీటిని తయారు చేయడం బాగుందని సాయిమాధవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాటూరి రవిచంద్ర, అయినాల మల్లేశ్వరరావు, జానీబాషా, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలి

తెనాలిఅర్బన్: కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు సూచించారు. అమర్ రాజా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. 10, ఇంటర్, ఐటీఐ కోర్సులు చేసిన వారికి ఇంటర్వ్యూ చేసి ఎంపికైనవారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖుద్దూస్, రమ్య, సుంకర హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక



తెనాలిఅర్బన్: జాతీయస్థాయి చదరంగం పోటీలకు తెనాలి సుల్తానాబాద్‌లోని భాష్యం స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న చౌడీ మేరి అక్షయ ఎంపికైనట్లు ప్రిన్సిపాళ్లు మణికాంత్ దత్తు, రాములు తెలిపారు. ఇటీవల కాకినాడ జిల్లా పెద్దాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరచడంతో విద్యార్థినిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆదివారం పాఠశాల ఆవరణలో విద్యార్థినికి మెమోంటో అందజేసి అభినందించారు. హెచ్ఎం నాజ్‌నీన్ జిగర్, జడ్‌వో హృదయరాజు, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి సీనియర్ సిటిజన్స్ నూతన కార్యవర్గం

తెనాలి: తెనాలి పట్టణంలో 2018 సంవత్సరంలో స్థాపించిన 'ది తెనాలి సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం' సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం జరిపారు. 2025 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విశ్రాంత ప్రిన్సిపాల్ గుమ్మడి నారాయణరావు, కార్యదర్శిగా కావూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా పీవీ రాంబాబు, కోశాధికారిగా పి.మల్లికార్జున రావు, సంయుక్త కార్యదర్శిగా రామినేని భుజంగరావు, కార్యవర్గ సభ్యులుగా కొడాలి చంద్రమౌళి, యార్లగడ్డ రాధాకృష్ణ, శాఖమూరి వెంకటేశ్వరరావు, శాఖమూరి మల్లికార్జునరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాజ్యాంగ హక్కులను గౌరవిద్దాం

- ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్
- సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు
- వాడవాడలా రెపరెపలాడిన త్రివర్ణ పతాకం
- ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, వివిధ సంస్థల్లో పతావిష్కరణలు



తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



తెనాలి కోర్టు ఆవరణలో జెండా వందనం చేస్తున్న న్యాయమూర్తులు

తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం ఉదయం ఘనంగా జరిగాయి. తెనాలి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమక్షంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనం చేశారు. ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. రాజ్యాంగం ద్వారా ప్రజలందరికీ లభించిన హక్కులను గౌరవించాలని సూచించారు. పలువురు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, సభ్యుడు కుర్రా శ్రీను, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో...

స్థానిక కొత్తపేటలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి నేతృత్వంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తెనాలి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాను ఎగురవేసి అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ, కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, సభ్యుడు కుర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అఫీషియల్స్ క్లబ్‌లో...

సబ్ కలెక్టర్ కార్యాలయం దగ్గరి ది అఫీషియల్స్ క్లబ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లోనూ ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు. క్లబ్ తరపున ఫ్రాంక్లిన్, సీహెచ్ శ్రీనివాసరావు, ప్రసాద్, చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కలిగి ఉండాలి

తెనాలిఅర్బన్: రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండాను కమిషనర్ బండి శేషన్న ఎగురవేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడారు. వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, కూరపాటి లక్ష్మి, దాసరి వసంతరావు, గౌడవర్తి శ్రీసాయి హరేరామ్, వీర్లపాటి విజయలక్ష్మి, యాతాటి అనిల్, షేక్ ఇస్మాయేల్, కొమ్మరబత్తిని జయపాల్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని కొత్తమాసు చంద్రకళ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను పొట్టి శ్రీరాములు విద్యాసంస్థల అధ్యక్షుడు నంబూరు వెంకటకృష్ణమూర్తి, బస్టాండ్ సమీపంలోని ఎన్ఆర్కె కెఎస్ఆర్ గుప్తా కళాశాలలో ఏర్పాటు చేసిన జెండాను ప్రిన్సిపాల్ గోగినేని విజయకృష్ణ ఎగురవేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను బోసురోడ్డులోని జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సీనియర్ నాయకులు తోటకూర రమణరావు ఎగురవేశారు.



జెండావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

- ఐతానగర్‌లోని 22వ ఆంధ్ర బెటాలియన్ కార్యాలయంలో లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ జెండా ఎగురవేశారు. అనంతరం స్వచ్ఛ తెనాలి–బ్యూటీఫుల్ తెనాలి– క్లీన్ కెనాల్– సేవ్ కెనాల్ అనే నినాదంతో పట్టణంలో ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సుబేదార్ మేజర్ గురుదీప్ కుమార్, ఎన్‌సీసీ అధికారులు పరిశా సర్దార్, తాడిబోయిన వెంకట భాస్కర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.
- జెఎంజె మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన జెండాను విజయవాడలోని ఆంధ్ర లయోలా కాలేజ్ పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ శ్యాముల్ దయాకర్ ఎగురవేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ, విద్యార్థులు పాల్గొన్నారు.
- చినరావూరు పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, 15వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పాల్గొని జెండాను ఎగురవేశారు. అనంతరం 125మంది పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, నాయకుడు కుక్కల వాసు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.
- వహాబ్‌చౌక్‌లో కుర్రాశ్రీను, సయ్యద్ బాషా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ జెండాను రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి ఎగురవేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుర్రా సుజాత, పసుపులేటి త్రిమూర్తి, దేసు యుగంధర్ ఆవుల కోటయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి హరీష్, యలవర్తి సాంబశివరావు, షేక్ కాలేషా, షేక్ మీరావలి, నల్లగొర్ల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.
- నాజర్‌పేటలోని అరవింద స్కూల్‌లో ఏర్పాటు చేసిన జెండాను ప్రధానోపాధ్యాయురాలు ఆర్.నిర్మలకుమారి ఎగురవేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాలేజీలో...

తెనాలి: రిపబ్లిక్ డే సందర్భంగా తెనాలి అంబేడ్కర్ కాలేజ్ ఆవరణలో వేడుకలు ఘనంగా జరిగాయి. కాలేజ్ కరస్పాండెంట్ శ్రీమతి మేరీ గ్రేస్ రాజకిషోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లెక్చరర్‌గా 38 సంవత్సరాలు పనిచేసి త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న కాకి సమాధానరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. కాలేజ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రియదర్శిని, నెల్లూరు రిజిస్ట్రేషన్ విభాగంలో పనిచేస్తున్న అశోక్ వర్ధన్, ప్రిన్సిపాల్ డాక్టర్ జంగం సుధీర్, ఎన్‌సీసీ అధికారి సామ్యూ నాయక్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శన ఆకట్టుకుంది.

బీజేపీ ఆధ్వర్యంలో...

తెనాలి: బీజేపీ ఆధ్వర్యంలో రిపబ్లిక్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మూడో డివిజన్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎర్రమరాజు సందీప్ రాజు జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కనకదుర్గ, తెనాలి కన్వీనర్ కఠారి వాసుదేవ నాయుడు, శంకరరావు, మాధవిలత, రమణరాజు, బూతు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

తెనాలిరూరల్: గణతంత్ర దినోత్సవాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో ఆదివారం జరుపుకొన్నారు. వాడ వాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయపార్టీల కార్యాలయాలతో పాటు, ప్రధాన కూడళ్లలో జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవించారు. దేశభక్తిని చాటారు. పట్టణ కొత్తపేటలోని తెనాలి కోర్టుల ప్రాంగణంలో 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ జెండాను ఆవిష్కరించారు. న్యాయమూర్తులు ఇందిరా ప్రియదర్శిని, ఎం.శ్రీధర్, పవన్‌కుమార్, వివేక్ వర్ధన్, పి.రాజశేఖర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండాను అన్ని పోలీస్‌స్టేషన్‌లలో ఆవిష్కరించారు. తెనాలి సబ్ డివిజనల్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంపైన డీఎస్పీ బి. జనార్ధనరావు, వన్‌టౌన్, టూ టౌన్, రూరల్ సర్కిల్ కార్యాలయాల్లో సీఐలు మల్లికార్జునరావు, రాముల నాయక్, ఎస్.రమేష్‌బాబు, బి.శ్రీనివాసరావు జాతీయ జెండాలను ఎగురవేశారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. తెనాలి జీఆర్పీ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఎస్ఐ వెంకటాద్రి జాతీయ జెండా ఆవిష్కరించారు.



కొల్లిపర జెండావిష్కరణ కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, ఎంపీడీఓ విజయలక్ష్మి



కొల్లిపర తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న డీటీ ఉప్పల రాజేష్

కొల్లిపరలో...

కొల్లిపర: 76వ గణతంత్ర సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ఆయా కార్యాలయాలు, పాఠశాలల్లో అధికారులు జెండా వందనం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఉప్పల రాజేష్ జెండా ఎగురవేసి గణతంత్ర సందేశం అందించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఎంపీడీఓ విజయలక్ష్మి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పి.కోటేశ్వరరావు, మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ సాల్మన్‌రాజులు జెండావిష్కరణ చేశారు.



జెండా ఆవిష్కరణ చేసిన బీజేపీ నాయకులు



అంబేడ్కర్ కాలేజీలో జాతీయ జెండా ఆవిష్కరణ



ఆంధ్ర బెటాలియన్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ శేషన్న, కౌన్సిలర్లు కోటేశ్వరరావు, సంజీవరెడ్డి

'మానవత' సాయం అభినందనీయం

టీబీ, హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహార కిట్ల పంపిణీలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ



బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ

తెనాలి: చైతన్యవంతమైన తెనాలిలోనూ మనుషుల్లో మానవత్వం లోపించటం బాధాకరమని, అలాంటి రోజుల్లో మానవత సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు, సహాయం చేసేందుకు సభ్యులు పోటీపడుతుండటం సంతోషం కలిగిస్తోందని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటైన సభకు అధ్యక్షుడు డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. 'ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్' పిలుపునకు తమ వంతుగా సంస్థ ఆధ్వర్యంలో తెనాలి, పరిసరాల్లోని 50 మంది టీబీ, హెచ్ఐవీ రోగులకు నెలకు సరిపడా రూ.25 వేల విలువైన పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. సభలో ముఖ్యఅతిథి కేవీ గోపాలకృష్ణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ఎక్కడ అవసరం ఉంటే అక్కడ మానవత సభ్యులు సైనికుల్లా తోడ్పడాలని సూచించారు. తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. మానవత రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మానవత సభ్యుల టీమ్ వర్క్‌ను ఆయన అభినందించారు. గుంటూరు అడిషనల్ డీఎంహెచ్ఓ, డీఎల్ఏటీతో డాక్టర్ డి.శ్రీనివాసులు మాట్లాడుతూ, టీబీ రోగులు, టీబీతోపాటు హెచ్ఐవీ బాధితులకు మానవతా దృక్పథంతో సాయపడుతున్న సంస్థకు ధన్యవాదాలు తెలియజేశారు. గుంటూరు పీపీఎం వి.రాజశేఖర్, తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ టీబీ, హెచ్ఐవీ రోగులకు సాయపడుతున్న సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. మానవత ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్య శాస్త్రి, కూరపాటి కళ్యాణి, డాక్టర్ శ్యాంసన్, శర్మ, ఈఎల్‌వీ అప్పారావు మాట్లాడారు. సభకు ముందుగా రిపబ్లిక్ డే రోజున ఉత్తమ తహసీల్దార్‌గా జిల్లా కలెక్టరుగా ప్రశంసాపత్రం అందుకున్న మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను సత్కరించారు.

గాయకులకు బహుమతుల ప్రదానం

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో తిరుమలలో అన్నమయ్య సంకీర్తన గానం చేసిన 50 మంది సభ్యులకు ప్రోత్సాహం నిమిత్తం నగదు బహుమతి, జ్ఞాపికలను ఆదివారం పంపిణీ చేశారు. సంకీర్తన బృందం, దాతల సహకారంతో సాయంత్రం ఇక్కడి గీతామందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సంగీత గురువు కత్తివెంటి కమల చేతులమీదుగా పంపిణీ చేశారు. గత నెల 27వ తేదీన తిరుమల ఆస్థానమండపంలో ఉదయం 10 గంటల్నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సంకీర్తన గానం చేసిన సభ్యులను ప్రోత్సహించటం మంచిదన్నారు. పిల్లలు, పెద్దల్లో భక్తిభావం పెరగటానికి, అన్నమయ్య సంకీర్తనల ప్రచారం నిమిత్తం ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని నిర్వాహకుడు కొండపి శ్రీనివాసరావు చెప్పారు. గుంటూరు చెందిన సంకీర్తన గురువు తురగా కళ్యాణి, సుధామాధవి, తెనాలికి చెందిన నందిరాజు ప్రసూనను సంస్థ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. గీతా మందిరం కార్యదర్శి రమేష్, ఈవీఎల్ అప్పారావు, గోపు నరేంద్ర, మాదల సత్యకుమారి, కటకం అన్నపూర్ణ, నంబూరి వినతి, వీరంశెట్టి రజిని, లక్కరాజు కనకదుర్గ పాల్గొన్నారు. సంకీర్తన గురువు కొండపి వసుంధర పర్యవేక్షించారు.



తిరుమల సంకీర్తన గాయకులకు బహుమతులు అందజేస్తున్న కమల

నేడు మంత్రి మనోహర్ పాదయాత్ర

తెనాలిఅర్బన్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ఉదయం 9గంటలకు ఒకటి, రెండు వార్డులలో పాదయాత్ర చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఐతానగర్‌లోని పేరాంటళ్ళ గుడి నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. కౌన్సిలర్లు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు పాల్గొనాలని కోరారు.

కుష్ఠు బాధితులకు అవగాహన

తెనాలి: స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలోని ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్–స్టూడెంట్ ఫెడరేషన్ (ఐపీఏ–ఎస్ఎఫ్), ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు ఆదివారం సమీపంలోని మోరంపూడి గ్రామంలో గల గ్రెటనాల్టస్ ఆస్పత్రిలో కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్ఠు రోగులకు సేవ చేసిన జాతిపిత మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకుంటున్నామని, వ్యాధి సోకినా కచ్చితమైన చికిత్సను తీసుకుంటూ అందరిలా సుఖవంతమైన జీవితాన్ని గడపొచ్చని అక్కడి రోగులకు విద్యార్థులు తెలియజేశారు. ఈ ఏడాది వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 'ఐక్యం..చర్య తీసుకోండి..నిర్మూలించండి' నినాదాన్ని ఇచ్చిందన్నారు. కుష్ఠు వ్యాధిని ఎలా జయించాలి? ఇతరులకు సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఏపీటీఐ–ఏపీ స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకట రమణ, గ్రెటనాల్టస్ ఫౌండేషన్ డైరెక్టర్ వి.హేమచంద్, మెడికల్ ఆఫీసర్ సీహెచ్ శివకుమార్, ఐపీఏ–ఎస్ఎఫ్ మెంటర్స్ జి.నంద గోపాలకృష్ణ, పి.భార్గవి, ఎన్ఎస్ఎస్ 1,2 విభాగాల ప్రోగ్రాం అధికారులు టి.జ్యోతిబసు, కె.కళ్యాణ చక్రవర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

వరిగడ్డి దగ్ధం

తెనాలిరూరల్: ట్రాక్టర్ ట్రెయిలర్‌పై ఉన్న వరిగడ్డి దగ్ధమైన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. స్థానిక చినరావూరులో రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం గడ్డి ట్రాక్టర్ పై ఉన్న వరిగడ్డి దగ్ధమైంది. రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రెయిలర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ట్రాక్టర్‌లోని ఎండు వరిగడ్డి తగలబడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపకాధికారి కోటిరెడ్డి, సిబ్బంది కలిసి మంటలను అదుపు చేశారు. ట్రాక్టర్‌లో మంటలు అంటుకుని తగలబడిపోతున్న గడ్డిని అగ్నిమాపక సిబ్బంది అతికష్టం మీద అదుపు చేశారు. దీంతో గడ్డి దగ్ధం కాగా ట్రాక్టర్‌ను మాత్రం అగ్నికి ఆహుతికాకుండా కాపడగలిగారు. అవనిగడ్డ నుంచి గడ్డి లోడుతో ట్రాక్టర్ తీసుకువచ్చి అన్‌లోడ్ చేసేందుకు రోడ్డు పక్కన నిలిపి ఉంచామని డ్రైవర్ చెప్పారు. ట్రాక్టర్ రన్నింగ్‌లో ఉండగా ఎక్కడో విద్యుత్ వైర్లు తగిలి నిప్పురాజుకుని ఇక్కడకు వచ్చాక తగలబడి ఉంటుందని ఫైర్ అధికారి కోటిరెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అగ్నిమాపక అధికారులు, సిబ్బందిని స్థానికులు అభినందించారు.

సంతానోత్పత్తి సాఫల్య వైద్యశిబిరం



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, విజయవాడకు చెందిన నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి రోటరీ కార్యాలయంలో ఉచిత ఐవీఎఫ్ ఫెర్టిలిటీ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ముఖ్యఅతిథిగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా సంస్థ కార్యాలయంలో జాతీయజెండాను ఆవిష్కరించారు. పిల్లలు లేని దంపతులు జీవన విధానంలో మార్పులు చేసుకుంటే సాఫల్యం పొందవచ్చని తెలిపారు. అప్పటికీ సంతానం కలగటంలో ఏదైనా సమస్య ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఐవీఎఫ్ ఫెర్టిలిటీచే తెనాలి ఉచిత వైద్యశిబిరం నిర్వహించటం, ఇక్కడ అవసరమైనవారికి మహదవకాశంగా అభిప్రాయపడ్డారు. ఫెర్టిలిటీ వైద్యనిపుణురాలు డాక్టర్ వై.స్వప్న పరీక్షలు చేసి అవసరమైన సలహాలను ఇచ్చారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, నల్లూరి వెంకటేశ్వరరావు, ఆలపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి 24వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక కవిరాజ పార్కులోని అసోసియేషన్ హాలు వీజీకే భవన్‌లో జరిగిన వేడుకలకు సంస్థ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఏడాదికాలంగా నిర్వహించిన సమావేశాలు, వైద్య అవగాహన, ఆధ్యాత్మిక సదస్సుల వివరాలను తెలియజేశారు. భవన నిర్మాణ దాత, ప్రవాస భారతీయుడు డాక్టర్ ఆర్.బాబు వడ్లమూడి, పావులూరి శ్రీనివాసరావు, అయినాల మల్లేశ్వరరావును సత్కరించారు. కార్యదర్శి పూర్ణచంద్రరావు, కోటయ్య, అజ్గర్‌అలీ, కోటిరెడ్డి, ఆదినారాయణ, హనుమారెడ్డి, నాగేంద్రయ్య, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిరండి

తెనాలిఅర్బన్: రాష్ట్ర నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కమిటీ ప్రమాణస్వీకారం మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ డైరెక్టర్ తెనాలివాసి కురగంటి రఘురామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ రుద్రకోటి సదాశివం అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు పాల్గొంటారన్నారు.